హాస్టళ్లలోని చీడపీడల నివారణకు

సరికొత్త పరిష్కారం

ప్రొ. బీఆర్ శ్యామన్నతో కలిసి తేజస్ ఆంటో కొత్త ప్రయత్నం

తేజస్ ఆంటో (ఫైల్)

కొండాపూర్, డిసెంబర్ 23: హాస్టళ్లలో తరచు ఇబ్బంది పెట్టే చీడపీడల నివారణకు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి సరికొత్త పరిష్కారాన్ని కనుగొన్నాడు. వర్సిటీలోని ఐఎంఎస్సీ సైన్సెస్ ఫిజిక్స్ స్ట్రీమ్-2022 విద్యా సంవత్సరానికి చెందిన తేజస్ ఆంటో కన్నంపూజ హాస్టళ్లలో విద్యార్థులను ఇబ్బందులకు గురి చేసే చీడ పీడల నివారణకు స్కూల్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ప్రొఫెసర్ బీఆర్ శ్యామన్నతో కలిసి సరికొత్త పరిష్కా రం కనుగొన్నాడు. సాధారణంగా వినియోగించే విద్యుత్ బల్బుల కంటే తక్కువ అతినీల లోహిత విద్యుత్ కాంతి ప్రసారణ ద్వా రా యాసిడ్ ఫ్లై (ఒక రకమైన పురుగులు) దాడులను తగ్గించవచ్చని పరిశోధనలో వెల్లడైంది. ఎల్ఈడీ, సీఎఫ్ఎల్‌లు సాధారణ లై ట్ల కంటే గణనీయంగా యూవీ-ఏ రేడియేషన్‌ను విడుదల చేస్తాయని, ఇతర వాటితో పోల్చితే వీటి కాంతిలో గదులలో యాసిడ్ ఫ్లై దాడుల రేటు తగ్గుతుందని తేజస్ పరిశోధనలో వెల్లడైంది. ఎల్ఈడీ లైట్లకు మారడం సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ఇప్పటికే క్యాంపస్‌లోని పలు గదులలో పరిశీలించినట్లు వెల్లడించారు. తేజస్ పరిశోధనకు అతని బృందాన్ని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ బీజే రావు ప్రత్యేకంగా అభినందించారు.

నార్త్ సిటీ అభివృద్ధికి బీఆర్ఎస్ కృషి

బీఆర్ఎస్ ప్రతిపాదనలపై కాంగ్రెస్ కాలయాపన

- మెట్రో, ఐటీ పార్కుల అభివృద్ధికి గతంలోనే ప్రణాళికలు
- మెట్రో ఫేజ్-2లో చోటు కల్పించేలా పెరుగుతున్న డిమాండ్

సిటీబ్యూరో, డిసెంబర్ 23(నమస్తే తెలంగాణ): విశ్వనగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు పదేళ్లలో బీఆర్ఎస్ ఎంతగానో కృషి చేసింది. ఐటీ కారిడార్‌పై పెరుగుతున్న ఒత్తిడికి అనుగుణంగా నగరం నలువైపులా పారిశ్రామిక, వాణిజ్య కార్యకలాపాలను ప్రోత్సహించేలా మౌలిక వసతులపై దృష్టి పెట్టింది. ఈ క్రమంలో ప్రభుత్వం నార్త్ సిటీ అభివృద్ధికి కీలక నిర్ణయాలు తీసుకున్నది. గేట్ వే ఆఫ్ నార్త్ తెలంగాణగా పిలిచే ప్రాంతాలను పారిశ్రామిక కేంద్రాలుగా తీర్చిదిద్దేలా ఐటీ పార్కులు, ఇండస్ట్రీయల్ కారిడార్లతో పాటు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేలా ప్రణాళికలను రూపొందించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో ఐటీ పార్క్ డెవలప్‌మెంట్‌కు ప్రణాళికలను అమలు చేశారు. అదే విధంగా ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి, బల్దియాలో కంటోన్మెంట్ విలీనంపై ప్రత్యేక దృష్టి సారించింది. కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపింది. రక్షణ శాఖ భూములను రాష్ట్రానికి కేటాయించాలని ప్రతిపాదించింది. పెండింగ్‌లో ఉన్న కేటాయింపుల ప్రక్రియ ముందుకు కదలడంతో, నార్త్ సిటీలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ఏడాది క్రితం కాంగ్రెస్ శంకుస్థాపన చేసింది. తాను ఎంపీగా గెలిచిన తర్వాత మల్కాజిగిరి ప్రజలకు రుణపడి ఉంటానని, ఈ ప్రాంత అభివృద్ధికి కట్టుబడి ఉన్నానంటూ సీఎం రేవంత్ రెడ్డి అనేక సార్లు ప్రకటించారు. కానీ, ఇటీవల ఫేజ్-2 విస్తరణ ప్రణాళికల్లో ఆ ప్రాంతాన్ని పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో పెద్ద ఎత్తున ఆందోళనలు వ్యక్తమయ్యాయి. నార్త్ సిటీ మెట్రో అభివృద్ధిపై సీఎం రేవంత్ పునరాలోచన చేయడంతో ఆ ప్రాంత వాసులు గంపెడాశలు పెట్టుకున్నారు. స్థానికుల మనోభావాలు, అభిప్రాయాలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన

నగరం నలువైపులా అభివృద్ధి పరిచే బీఆర్ఎస్ ప్రణాళికలపై కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. కనీసం మెరుగైన రవాణా సౌకర్యాలను అందించే మెట్రో విషయంలోనూ నాన్చుడు ధోరణితో వ్యవహరిస్తుండగా, ఇప్పటికే నార్త్ సిటీ ప్రాంతాలు లేకుండానే డీపీఆర్ సిద్ధమైంది. ఈ క్రమంలోనే పెద్ద ఎత్తున వ్యక్తమైన ఆందోళనలతో కాంగ్రెస్ పునరాలోచనలో పడింది. అయితే, మేడ్చల్ మెట్రో సాధన సమితికి మద్దతుగా నిలవడంలో బీఆర్ఎస్ ముఖ్య భూమికను పోషించింది. ఈ క్రమంలోనే తమ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎమ్మెల్సీ శంబీపూర్ రాజు ఎంతగానో కృషి చేశారు. నార్త్ సిటీ సాధనకు కాంగ్రెస్‌పై ఒత్తిడి చేశారు. ప్రధానంగా నార్త్ సిటీ మెట్రో విషయంలో అసెంబ్లీ వేదికగా గొంతెత్తారు. వీరితో పాటు నార్త్ సిటీ ప్రాంతవాసులు ఏడాది కాలంగా సీఎం రేవంత్ రెడ్డి దృష్టి వచ్చేలా పలు కార్యక్రమాలను నిర్వహిస్తూనే ఉన్నారు. ఈ క్రమంలోనే సుచిత్ర సర్కిల్‌లో భారీ సమావేశం, ఫ్ల కార్డుల ప్రదర్శన, ఇంటింటికి మెట్రో సాధన వంటి కార్యక్రమాలతో తమ ఆవేదనను వినిపించారు.

పెరుగుతున్న ఒత్తిడి..

నార్త్ సిటీ మెట్రో విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పునరాలోచన చేసే విధంగా స్థానికులతో కలిసి బీఆర్ఎస్ కృషి చేసింది. పార్టీలకతీతంగా తమ ప్రాంతానికి న్యాయం చేయాలంటూ అన్ని పార్టీల నేతలను సమన్వయం చేయడంలో బీఆర్ఎస్ ముఖ్యపాత్ర పోషించింది. ఈ క్రమంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పలుమార్లు మెట్రో సాధన సమితి సభ్యులను తీసుకెళ్లి మెట్రో ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డిని కలిసి ఈ ప్రాంతాన్ని మెట్రో ప్రాధాన్యతను వివరించారు. గతంలో తమ ప్రాంతంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మెట్రో ఆవశ్యకతను వెల్లడించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా సీఎం రేవంత్ రెడ్డిని కలిసి తమ నియోజకవర్గ ప్రజల ఆశలు, మెట్రో సాధనకు చొరవ తీసుకున్నారు.

మెట్రో ఎండీని కలిసిన మేడ్చల్ మెట్రో సాధన సమితి, ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

సీఎం నిర్ణయంపై గంపెడాశలు...

ఫేజ్-2 మెట్రో విస్తరణలో నార్త్ సిటీని డీపీఆర్‌లో చేర్చకపోవడం కొంత నిరాశ కలిగించింది. కానీ, గత కొంత కాలంగా ఈ ప్రాంత వాసుల ఆవేదనను సీఎం రేవంత్ రెడ్డి పరిగణనలోకి తీసుకున్నట్లుగా, ఫేజ్-2 విస్తరణపై పునరాలోచన చేయడం అభినందనీయం. ఇటీవల మెట్రో ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి కూడా మెట్రో విస్తరణపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని వ్యాఖ్యానించడంతో మళ్లీ మెట్రోపై ఆశలు చిగురించాయి. ఎన్నో ఏళ్లుగా, లక్షలాది మంది ప్రజల ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని, సీఎం రేవంత్ రెడ్డి కూడా స్పందిస్తారనే నమ్మకం వచ్చింది. ఈ ప్రాంత ప్రజల మనోభావాలకు అనుగుణంగానే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికలను అమలు చేస్తుందని ఆశాభావంతో ఉన్నాం.

– మేడ్చల్ మెట్రో సాధన సమితి

మెట్రో తోనే మెరుగైన రవాణా..

నగరంలోని అన్ని ప్రాంతాల కంటే వేగంగా నార్త్ సిటీలో జనాభా పెరుగుతోంది. ప్రధానంగా ఉద్యోగులు, స్కిల్డ్ లేబర్, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసేవారే మల్కాజిగిరి ప్రాంతంలో ఎక్కువగా ఉన్నారు. వీరంతా రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బీఆర్ఎస్ హయాంలోనే ఈ ప్రాంత అభివృద్ధికి ప్రణాళికలను అమలుల్లోకి వచ్చాయి. కాంగ్రెస్ ప్రభుత్వమైన పార్టీలకు అతీతంగా నార్త్ సిటీలో ఉన్న కుత్బుల్లాపూర్, మేడ్చల్, మల్కాజిగిరి, కంటోన్మెంట్ నియోజకవర్గాల ప్రజలను పరిగణనలోకి తీసుకుని ఫేజ్-2 లోనే మెట్రో నిర్మించాల్సిన అవసరం ఉంది. నార్త్ సిటీ మెట్రోపై అన్ని ప్రజా సంఘాలు, కాలనీ ప్రతినిధులు కూడా ఏడాది కాలంగా ఉద్యమిస్తున్నాయి. వారి మనోభావాలు, అభిప్రాయాలకు అనుగుణంగా మెట్రో నిర్మించేలా చొరవ తీసుకోవాలి. రెండు నెలల కిందటే మేడ్చల్ వరకు మెట్రో నిర్మించాలని హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డి కలిసి వివరించాను. అదే విధంగా అసెంబ్లీ సమావేశాల్లోనూ ఈ అంశాన్ని లేవనెత్తాను. సీఎం రేవంత్ రెడ్డి కూడా మెట్రో నిర్మాణం విషయంలో సానుకూలంగానే స్పందించారు. ప్రభుత్వం చొరవ తీసుకుని ఫేజ్-2 మెట్రో విస్తరణలోనే నార్త్ సిటీకి ప్రాధాన్యతనిస్తుందని ఆశతో ఉన్నాం.

– మర్రి రాజశేఖర్ రెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే

బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం

గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ మాజీ ఇన్‌చార్జ్‌లు

తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను కలిసిన గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ మాజీ ఇన్‌చార్జ్‌లు ఆర్వీ మహేందర్ కుమార్, ప్రేమ్ కుమార్ దూత్‌లు

అబిడ్స్, డిసెంబర్ 23: తెలంగాణ రాష్ట్రంలో తిరిగి బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, ఎప్పుడు ఎన్నికలు నిర్వహించినా బీఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టేందుకు ప్రజలు సంసిద్ధులై ఉన్నారని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ మాజీ ఇన్‌చార్జ్‌లు ఆర్వీ మహేందర్ కుమార్, ప్రేమ్ కుమార్ దూత్‌లు పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను మర్యాదపూర్వకంగా కలిసి గోషామహల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ పరిస్థితి గురించి చర్చించారు. ఈ సందర్భంగా ప్రేమ్ కుమార్ దూత్, ఆర్వీ మహేందర్ కుమార్‌లు మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీకి రాష్ట్రంలో తిరుగు లేదని, తప్పుడు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్క వాగ్దానాన్ని నెరవేర్చక పోతుండటంతో ప్రజలు కాంగ్రెస్ పాలనపై ఏడాదిలోనే విసిగి వేసారి పోయారన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంతో పాటు పదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా ఉండి పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలు చేపట్టారన్నారు. గోషామహల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని పటిష్ట పర్చేందుకు పాటు పడ్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక పథకాలను ప్రజలకు వివరించి బీఆర్ఎస్ పార్టీకి ప్రజల ఆదరణ పెరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఎప్పటికీ పుస్తకం మాత్రమే.. జ్ఞాన నిధి

మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ

చిక్కడపల్లి, డిసెంబర్ 23: మనం ఇప్పుడున్న సోషల్ మీడియా యుగంలో, ఫోన్లు జీవితాలు ఆక్రమించిన యుగంలో కొంచెం కష్టంగా ఉండవచ్చు గాని, అప్పటికి ఇప్పటికీ ఎల్లప్పటికీ పుస్తకం మాత్రమే జ్ఞానాన్ని అందిస్తుందని తెలంగాణ మీడియా అకాడమీ మాజీ చైర్మన్, సీనియర్ ఎడిటర్ అల్లం నారాయణ అన్నారు. ఇందిరా పార్క్ సమీపంలోని కళా భారతి ఎన్టీఆర్ స్టేడియంలో 37వ హైదరాబాద్ బుక్ ఫెయిర్ వేడుకగా కొనసాగుతుంది. సోమవారం, బుక్ ఫెయిర్ పుస్తక నడక (బుక్ వాక్) లోయర్ ట్యాంక్ బండ్ పుంచి బుక్ ఫెయిర్ ప్రాంగణం వరకు నిర్వహించారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్, సీనియర్ ఎడిటర్ అల్లం నారాయణ, సీనియర్ ఎడిటర్ కె.శ్రీనివాస్, వీక్షణం సంపాదకులు ఎన్.వేణుగోపాల్, ఎమెస్కో విజయ్ కుమార్, ఐజీ రమేశ్ పాల్గొన్నారు. అనంతరం, బుక్ ఫెయిర్ అధ్యక్షుడు యాకూబ్, ప్రధాన కార్యదర్శి వాసులు అల్లం నారాయణ, తదితరులకు సన్మానం చేశారు.

'నేను సేవ చేసిన న్యాయ వ్యవస్థ' పుస్తకావిష్కరణ

సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి పింగలి జగన్మోహన్ రెడ్డి రాసిన తెలుగు అనువాదం 'నేను సేవ చేసిన న్యాయ వ్యవస్థ' పుస్తకాన్ని సమాచార హక్కు కేంద్ర మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్ ఆవిష్కరించారు. ప్రముఖ చిత్రకారుడు ద్యావనపల్లి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ న్యాయమూర్తి మంగారి రాజేందర్, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, వెంకట్రామిరెడ్డి, జగన్మోహన్ రెడ్డి కుటుంబ సభ్యులు, రచయిత్రి ఊర్మిల, చంద్రమోహన్ పాల్గొన్నారు.

ముగిసిన బీఎస్‌బీ సదస్సు

సిటీబ్యూరో, డిసెంబర్ 23(నమస్తే తెలంగాణ): హరిద్వారాలోని యూనివర్సిటీ ఆఫ్ పతంజలి క్యాంపస్‌లో ఈ నెల 14, 15న భారతీయ శిక్షా బోర్డు(బీఎస్‌బీ) ఆధ్వర్యంలో ట్రాన్స్‌ఫార్మింగ్ స్కూల్ ఎడ్యుకేషన్ అంశంపై సదస్సు జరిగిందని నిర్వాహకులు సోమవారం పేర్కొన్నారు. ప్రాచీన విజ్ఞానాన్ని ఆధునిక విద్యలో మిళితం చేయడంపై చర్చించినట్టు తెలిపారు. కార్యక్రమంలో విద్యా భారతి అఖిల భారత శిక్షణ సంస్థాన్, భారతీయ శిక్షణ మండలి, ఇషా యోగా ఫౌండేషన్, రామకృష్ణ మిషన్ సంస్థ, అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ తదితర సంస్థల నిపుణులు పాల్గొని తమ సూచనలు తెలియజేసినట్టు వివరించారు. ఈ సందర్భంగా బీఎస్‌బీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ ఎన్‌పీ సింగ్ మాట్లాడుతూ, ప్రాచీన విద్య గొప్పతనాన్ని అర్థం చేసుకుని ఆధునిక విద్యా వ్యవస్థల్లో సరికొత్త మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని తెలిపారు.

చెరువుల ఆక్రమణలపై విచారణ

పూర్తి స్థాయి నివేదిక కోసం హైడ్రా కమిషనర్ ఆదేశం

సిటీబ్యూరో, డిసెంబర్ 23(నమస్తే తెలంగాణ): ఓఆర్ఆర్‌కు సమీపంలో ఉన్న పలు చెరువులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెరువుల ఆక్రమణలపై ప్రజలతో పాటు, ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో తనిఖీలు చేశారు. నానక్‌రాంగూడలోని తౌతాని కుంట, భగీరథమ్మ చెరువు, నార్సింగిలోని నెక్నాంపూర్ చెరువుల ఆక్రమణలపై ఈ సందర్భంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా చెరువుల్లోకి వరద నీరు రాకుండా కాలువలను మళ్లించడం, మూసివేయడంపై రెవెన్యూ, ఇరిగేషన్, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ అధికారులు సమగ్ర నివేదికను హైడ్రాకు అందించాలని కమిషనర్ ఆదేశించారు. చెరువులో మట్టిపోయడం, వరద కాలువలపై కూడా నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు ఫిర్యాదు చేశారు. మౌలానా అజాద్ ఉర్దూ యూనివర్సిటీ ఖాళీ స్థలం గుండా వరద నీరు వెళ్లే మార్గాలు మూసుకుపోవడంతో, తమ కాలనీల్లోకి వరద నీరు చేరుతుందని స్థానికులు ఆరోపించారు. అదే విధంగా నానక్‌రాంగూడ ప్రధాన రహదారికి ఎగువన ఉన్న తౌతాని కుంట చెరువు నీరు, దిగువన ఉన్న భగీరథమ్మ చెరువుకు వెళ్లేందుకు మార్గం మూసుకుపోయిందన్నారు. ఇరు చెరువుల అవుట్, ఇన్‌లెట్ల ఆక్రమణలను తొలగించాలని ఈ సందర్భంగా కమిషనర్ ఆదేశించారు. ఈ సందర్భంగా చెరువులు, కుంటల బఫర్ జోన్ ఆక్రమణలను సహించేది లేదనీ, మట్టి పోసిన వారిపై, సంస్థలను చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

ఉద్యమకారుల హామీలను నిలబెట్టుకోండి

తెలంగాణ ఉద్యమకారుల సంఘం అధ్యక్షులు రాసర్ల శ్రీశైలం

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీశైలం

ఖైరతాబాద్, డిసెంబర్ 23: తెలంగాణ ఉద్యమకారులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం అధ్యక్షులు రాసర్ల శ్రీశైలం డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రస్తుత సీఎం, అప్పటి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యమకారుల కుటుంబాలకు 250 గజాల స్థలం, ఆర్థిక సాయం అందజేస్తానని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఏడాది కావొస్తున్నా ఇప్పటి వరకు ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని, ఇప్పటికే ఆదిలాబాద్ నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు పాదయాత్ర నిర్వహించామని, ఇప్పటికైనా స్పందించకుంటే దక్షిణ తెలంగాణ మొత్తం పాదయాత్ర చేస్తామని, అప్పటికీ ప్రభుత్వంలో చలనం లేకుంటే ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షులు కృష్ణ ముదిరాజ్, కోశాధికారి మొయినుద్దీన్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌కు శివమ్ బెనర్జీ

జిల్లా విద్యా శాఖాధికారి డి.రోహిణీ

సిటీబ్యూరో, డిసెంబర్ 23(నమస్తే తెలంగాణ): 31వ ఎస్సీఎస్సీ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌కు సిస్టర్ నివేదిత స్కూల్ విద్యార్థి శివమ్ బెనర్జీ హైదరాబాద్ జిల్లా నుంచి ఎంపికైనట్టు జిల్లా విద్యాశాఖ అధికారి డి.రోహిణి తెలిపారు. జనవరి 3 నుంచి 5 వరకు మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరిగే బాలల సైన్స్ కాంగ్రెస్‌లో శివమ్ పాల్గొంటాని వివరించారు. తెలంగాణ నుంచి 16 మంది విద్యార్థులు ఎంపిక కాగా, నగరం నుంచి శివమ్ ఎంపికయ్యాడని తెలిపారు. విద్యార్థుల వినూత్న ఆలోచనలు చేయడం ద్వారా నూతన ఆవిష్కరణలు సృష్టించవచ్చని పేర్కొన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ దోహదపడుతుందన్నారు. అనంతరం, 9వ తరగతి విద్యార్థి శివం బెనర్జీని డీఈఓ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి సి.ధర్మేందర్ రావ్ పాల్గొన్నారు.

కుటుంబ పోషణ భారమవుతోంది

- వేతనాలు లేక 1962 సిబ్బంది వెతలు
- నాలుగు నెలలుగా వేతనాలకు నోచుకోని 'సంచార' సిబ్బంది

సంచార పశు వైద్యశాల సిబ్బంది

మేడ్చల్, డిసెంబరు 23: రాష్ట్ర ప్రభుత్వం హామీల అమలు, సంస్థల నిర్వహణలో పూర్తిగా విఫలమవుతూనే ఉంది. గతంలో సజావుగా నడిచే వ్యవస్థలు ఆర్థిక లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. నిధులు లేక నిర్వీర్యమయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. ఇందుకు 1962ను నిర్వహణ అద్దం పడుతుంది. మేడ్చల్ జిల్లాలో 1962 వాహనాలు రెండు నడుపుతున్నారు. సంచార పశు వైద్యశాలలుగా వెలుగొందుతున్న ఈ వాహనాలు ప్రతి రోజు 10 నుంచి 12 ప్రాంతాలను సందర్శిస్తూ పశువులకు మెరుగైన వైద్యం అందజేస్తున్నాయి. ఒక్కో వాహనంలో ఒక డ్రైవర్, ఒక వైద్యుడు, ఒక పారా మెడికల్ సిబ్బంది, ఒక సహాయకుడు ఉంటారు. వ్యవసాయం, పశు పోషణ ఉన్న జిల్లాలోని ప్రాంతాలను రెండుగా విభజించి, రెండు వాహనాల ద్వారా వైద్య సేవలందించేలా ఏర్పాటు చేశారు. సంచార వైద్యశాలల సిబ్బంది నేరుగా రైతు ఇంటికే వెళ్లి సేవలందిస్తున్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సిబ్బంది సేవలందిస్తున్నారు. వ్యాక్సినేషన్, మేకలను కుక్కలు కరిచినప్పుడు, చెత్తలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను తిన్న పశువులు అస్వస్థతకు గురైనప్పుడు సేవలు అందిస్తున్నారు. అవసరమైతే సర్జీలు కూడా చేస్తున్నారు. బండెడు చాకీరి చేస్తున్న సిబ్బందికి వేతనాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నాలుగు నెలలుగా వేతనాలు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారమని 1962 సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము ప్రతి రోజు కీసర, శామీర్‌పేట, మేడ్చల్, దుండిగల్, కుత్బుల్లాపూర్ ప్రాంతాల్లో సంచరిస్తూ వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. తక్కువ వేతనానికే పని చేస్తున్నా సరియైన సమయానికి వేతనాలు ఇవ్వకపోతే బతికేదెలా? అని వాపోతున్నారు. కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. అధికారులు స్పందించి వెంటనే వేతనాలు విడుదల చేయాలని వారు కోరుతున్నారు.

అంబేద్కర్ వర్సిటీ ప్రొఫెసర్‌కు పీఆర్ఎస్ఐ జాతీయ అవార్డు

ఛత్తీస్‌గఢ్ ఉప ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న యాదగిరి

ఖైరతాబాద్, డిసెంబర్ 23: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ ఇన్‌చార్జి విభాగాధిపతి, అసిస్టెంట్ ప్రొఫెసర్, పబ్లిక్ రిలేషన్ సొసైటీ ఆఫ్ ఇండియా, హైదరాబాద్ చాప్టర్ కార్యదర్శి డాక్టర్ కంభంపాటి యాదగిరికి అరుదైన పురస్కారం లభించింది. నిబద్ధత, అంకితభావంతో సుదీర్ఘ కాలంగా ప్రజా సంబంధాల రంగంలో చేస్తున్న అవిరళ కృషిని అభినందిస్తూ పీఆర్ఎస్ఐ జాతీయ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ మేరకు ఛత్తీస్‌గడ్‌లోని రాయ్‌పూర్‌లో జరిగిన 46వ పీఆర్ఎస్ఐ ఆల్ ఇండియా కాన్ఫరెన్స్‌లో ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అరుణ్ సాహు చేతుల మీదుగా యాదగిరి జాతీయ అవార్డును అందుకున్నారు. ఆయన వెంట పీఆర్ఎస్ఐ జాతీయ అధ్యక్షులు డాక్టర్ అజిత్ పాఠక్, కార్యదర్శి డాక్టర్ పీఎల్‌కే మూర్తి, హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ రాము ఉన్నారు. జాతీయ అవార్డు అందుకున్న డాక్టర్ యాదగిరిని అంబేద్కర్ వర్సిటీ డీన్ ప్రొఫెసర్ వడ్డాణం శ్రీనివాస రావు, ప్రొఫెసర్లు, పరిశోధకులు అభినందించారు.

ప్రజావాణి ఫిర్యాదులకు సత్వరమే పరిష్కారం చూపండి

177 ఆర్జీలను స్వీకరించిన జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి

సిటీబ్యూరో, డిసెంబర్ 23(నమస్తే తెలంగాణ): ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యత నిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీసులో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని ప్రజల నుంచి వారి సమస్యలను ఓపికగా వింటూ అర్జీలను స్వీకరించారు. ఆయా సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని కమిషనర్ భరోసా ఇచ్చారు. ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పరిష్కరించడంపై ఆయా అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు. రోడ్ల మరమ్మతులు, డ్రైనేజీ సమస్యలు, అనధికార నిర్మాణాలు, పారిశుద్ధ్య నిర్వహణ, కుక్కల సమస్యలు, ఉద్యోగం కల్పించాలని, భూసేకరణకు సంబంధించిన పరిహారం అందించాలని తదితర సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయని పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులు వెంటనే ఆయా సమస్యల పరిష్కారంపై వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజావాణి ఫోన్ ఇన్ ప్రోగ్రాం ద్వారా ఐదు విన్నపాలు రాగా, పరిష్కారం నిమిత్తం ఆయా విభాగాలకు పంపించడం జరిగిందన్నారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 62 విన్నపాలు రాగా, అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి 28, ఇంజనీరింగ్ మెయింటెనెన్స్ 7, ట్యాక్స్, ఎఫ్ఏ సెక్షన్లకు 6 చొప్పున, శానిటేషన్ విభాగాలకు 3 చొప్పున, యూసీడీ, హెల్త్, వెటర్నరీ విభాగాలకు 2 చొప్పున, యూబీడీ, హౌసింగ్, అడ్మినిస్ట్రేషన్ విభాగాలకు ఒక్కొక్కటి చొప్పున ఫిర్యాదులందాయి. జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 115 అర్జీలు వచ్చాయని అధికారులు వివరించారు. కూకట్‌పల్లి జోన్‌లో 41, సికింద్రాబాద్ జోన్‌లో 20, శేరిలింగంపల్లి జోన్‌లో 22, చార్మినార్ జోన్‌లో 6, ఎల్బీనగర్ జోన్‌లో 21 విన్నపాలు రాగా, ఖైరతాబాద్ జోన్‌లో 05 ఫిర్యాదులు అందాయని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు సుభద్రాదేవి, నళినీ పద్మావతి, పంకజ, అశోక్ సామ్రాట్, చంద్రకాంత్ రెడ్డి, సత్యనారాయణ, రఘు ప్రసాద్, యాదగిరి రావు, వేణు గోపాల్ రెడ్డి, చీఫ్ వెటర్నరీ అధికారి అబ్దుల్ వకీల్, సీఎంహెచ్ఓ డా. పద్మజ, అడిషనల్ సీసీపీలు ప్రదీప్, గంగాధర్ పాల్గొన్నారు.

ప్రపంచంలోనే అతి పెద్ద చాక్లెట్ చెస్ బోర్డు

అమీర్‌పేట్, డిసెంబర్ 23: ప్రతి యేడాది ఓ కొత్త రికార్డుకు రూపకల్పన చేస్తూ వస్తున్న బేగంపేట్‌లోని బ్రాండ్ సీఏఐ ఈ సంవత్సరం కూడా ప్రపంచంలోనే అత్తి పెద్దదైన చెస్ బోర్డును తయారు చేసింది. 16 అడుగులు, వెడలు 16 అడుగుల పొడవుతో మొత్తం చదరంగం బోర్డు, అందులోని పావులను కలిపి 256 చదరపు అడుగులతో చాక్లెట్‌తో ఈ చెస్ బోర్డును తీర్చిదిద్దారు. మొత్తంగా 550 కేజీల చాక్లెట్‌తో ఈ కేక్ చెస్ బోర్డును తయారీ బ్రాండ్ సీఏఐ డైరెక్టర్ సుధాకర్ ఎన్.రావు సహకారంతో చెఫ్ అటిక్, హెచ్‌వోడీ అక్షయ్ కులకర్ణి నేతృత్వంలో 10 మంది సీనియర్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్లు, 50 మంది కలినరీ విద్యార్థులు 96 గంటల పాటు అవిశ్రాంతంగా ఈ ప్రపంచ రికార్డు ఫీటును సాధించేందుకు కృషి చేశారు. ఈ అతి పెద్ద చాక్లెట్ కేక్‌ను తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ. బాలకిష్టారెడ్డి, కార్యదర్శి శ్రీరామ్ వెంకటేశం, వరల్డ్ ఛాంపియన్ క్లాసికల్ ఇటలీ, రాపిడ్ ఎట్ అల్బానియా అండర్-8 మాస్టర్ దివిత్ రెడ్డిలు సోమవారం మధ్యాహ్నం ఆవిష్కరించారు. కలినరీ విభాగంలో ఇప్పటికే ఐదు ప్రపంచ రికార్డులను సాధించిన సీఏఐ 2030 నాటికి ఈ సంఖ్యను 10కి పెంచేందుకు కృషి చేస్తున్నామని సంస్థ డైరెక్టర్ సుధాకర్ ఎన్.రావు తెలిపారు.

అతి పెద్ద చాక్లెట్ చెస్ బోర్డును పరిశీలిస్తున్న అతిథులు